7

సాక్షి
కుమురం భీం

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



మత్తు అలజడి
బెల్లంపల్లి మున్సిపాలిటీ, చుట్టుపక్కల గ్రామాల్లో గంజాయి గుప్పుమంటోంది. నిర్మానుష్య ప్రాంతాలను ఎంచుకుని యువకులు దమ్ము కొడుతున్నారు. 8లో▸



'ఉపాధి'పై అనాసక్తి!
ఉపాధి పనులపై కూలీలు ఆసక్తి చూపడం లేదు. కూలీల సంఖ్యను పెంచడంలో విఫలమయ్యారని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.8 /23.1
వాతావరణం
జిల్లాలో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

పాఠశాలల నిధులు సక్రమంగా ఖర్చు చేయాలి



మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన నిధులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సక్రమంగా ఖర్చు చేయాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతు వేదికలో బుధవారం పలు పాఠశాలల హెచ్‌ఎంలు, గ్రామ సమాఖ్య సంఘాల అధ్యక్షురాళ్లతో సమావేశమయ్యారు. డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని 685 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ఎస్‌ఎంసీల స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. వేసవి సెలవులు ముగిసి.. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా వసతుల కల్పన పనులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లోని సమస్యలను గుర్తించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల నోడల్ అధికారి ఉదయ్‌బాబు, ఎస్‌వోలు భరత్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి



నువ్వు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కెరమెరి(ఆసిఫాబాద్): నువ్వు పంటకు సోకే చీడపీడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ అన్నారు. మండలంలోని కెస్లాగూడ, సాకడ గ్రామాల్లోని కేవీకే ఆధ్వర్యంలో పంపిణీ చేసిన విత్తనాలతో సాగు చేసిన నువ్వుల పంట క్షేత్రాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నువ్వుల పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వెర్రి తెగులును గుర్తించామని తెలిపారు. ఆలస్యంగా వేసిన పంటకు ఇది ఎక్కువగా సోకుతుందని పేర్కొన్నారు. తెగులు బారిన పడిన మొక్కలను గుర్తించి వెంటనే తగులబెట్టాలని సూచించారు. అనంతరం చిన్నసాకడకు చెందిన ఆదివాసీ రైతులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు తిరుపతి, సతీశ్, రైతులు బాలాజీ, పెందోర్ ఆనంద్‌రావు, జలపతిరావు, దంబీరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులకు నిర్ధారణ పరీక్షలు



పరీక్షలు చేస్తున్న జిల్లా లెప్రసీ అధికారి

రెబ్బెన(ఆసిఫాబాద్): గత నెలలో చేపట్టిన ఇంటింటి సర్వేలో గుర్తించిన కుష్ఠు వ్యాధి అనుమానితులకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాలో కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, ఇతర వ్యాధి లక్షణాలు ఉంటే సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వీలైనంత వేగంగా వ్యాధి నిర్ధారణ జరిగితే అంతే త్వరగా నయం చేసుకోవచ్చన్నారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, కమ్యూనిటీ నాయకులు కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సుజిత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్, హెచ్‌ఈవో శామ్యూల్, నోడల్ అధికారి ప్రవీణ్, లెప్రో ఇండియా రాజేందర్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

కౌటాల(సిర్పూర్): గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని డీఎల్‌పీవో సురేశ్‌బాబు అన్నారు. మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామాన్ని బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో సక్రమంగా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలన్నారు. పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పట్టాలని ఆదేశించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాలన్నారు. వడదెబ్బపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

మొట్లగూడలో నీటి గోస



పెద్దవాగులో నీళ్లు నింపుకుంటున్న గ్రామస్తులు

- ప్రజల అవసరాలు తీర్చని 'మిషన్ భగీరథ'
- అడుగంటిన బావులు, చేతిపంపులు
- పెద్దవాగు నుంచి ఎడ్లబండ్లలో నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు
- బట్టలు ఉతికేందుకు అక్కడికే వెళ్తున్న మహిళలు



వాగు వద్ద బట్టలు ఉతుకుతున్న మహిళలు



ఇసుకలో అపసోపాలు పడుతూ నీటి తరలింపు..

దహెగాం(సిర్పూర్): పెద్దవాగు, ప్రాణహిత నదుల సమీపంలో ఉంది దహెగాం మండలంలోని మొట్లగూడ. ఇక్కడ చేతిపంపులు, బావుల్లో నీళ్లు ఇంకిపోయాయి. మిషన్ భగీరథ పథకంలో భాగంగా రోజుకు ఐదారు బిందెలకు మించి సరఫరా కావడం లేదు. నాలుగు వందల ఫీట్ల వరకు బోర్లు వేసినా నీటి జాడ కనిపించని పరిస్థితి. స్థానికంగా ఒక్క వ్యవసాయ బోరు కూడా లేదు. ఫలితంగా వేసవిలో దాహార్తి తీర్చుకోవడానికి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. పెద్దవాగు నుంచి ఎడ్లబండ్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. ఏటా ఇదే పరిస్థితి ఉంటున్నా శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమవుతున్నారు.

160 కుటుంబాలు

మొట్లగూడ గ్రామంలో 160 కుటుంబాలు ఉండగా.. సుమారు 800 మంది జనాభా ఉంది. మిషన్ భగీరథ పథకం కింద 173 నల్లా కనెక్షన్లు ఇచ్చారు. స్థానికంగా ఐదు చేతిపంపులు, నాలుగు బావులు ఉన్నాయి. భారీ వర్షం కురిసి నెలలు గడిచిపోవడంతో మార్చిలోనే చేతిపంపులు, బావుల్లో నీళ్లు ఇంకిపోయాయి. గ్రామస్తులు కేవలం మిషన్ భగీరథ తాగు నీటిపైనే ఆధారపడుతున్నారు. ఇటీవల రెండు రోజులు భగీరథ నీటి సరఫరా నిలిచిపోతే తాగేందుకు గుక్కెడు నీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డామని స్థానికులు వాపోయారు. ప్రస్తుతం మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్నా కేవలం ఐదారు బిందెలు మాత్రమే వస్తున్నాయి. కుటుంబంలోని వారి కనీస అవసరాలు తీర్చడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎడ్లబండ్లకు డ్రమ్ములు కట్టుకుని పెద్ద వాగు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు.

చుట్టూ జీవనదులు ఉన్నా..

మొట్లగూడ గ్రామానికి పక్కనే కిలోమీటర్ దూరంలో పెద్దవాగు, ప్రాణహిత వంటి జీవనదులు ప్రవహిస్తున్నాయి. అయినా భూగర్భ జలాలు అడుగంటి చేతిపంపులు, బావుల్లో నీరు ఇంకిపోయింది. నాలుగు వందల ఫీట్ల వరకు బోర్లు వేసినా నీరు జాడ లేదని స్థానికులు చెబుతున్నారు. పెద్దవాగు వద్ద భారీగా ఇసుక, పెద్దపెద్ద ఒడ్లు ఉండడంతో ఎడ్లు నడవడం కూడా కష్టంగా మారింది. ఇక ఎవరి ఇంట్లో అయినా శుభకార్యం ఉంటే రెండు ఎడ్లబండ్లను కిరాయి మాట్లాడుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు నీళ్లు తెచ్చుకోవాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బట్టలు ఉతకడానికి ఉదయాన్నే మహిళలంతా వాగుకు వెళ్తున్నారు. అక్కడే బట్టలు ఉతుక్కోని ఇంటికి వస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సరిపడా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అడుగంటిన బావి

వాగుకు వచ్చుడే..



సరిపడా నీళ్ల లేక పొద్దున్నే బట్టలు ఉతకడానికి వాగుకు వస్తాం. పెద్ద వాగు ఊరికి కిలోమీటరు దూరంలో ఉన్నందున ఒక్కరే రావాలంటే భయంగా ఉంటది. ఐదారు గురం కలిసి వస్తాం. నాలుగు రోజుల క్రితం భగీరథ నీళ్లు రాక ఇబ్బంది పడ్డాం. మా గురించి పట్టించుకునే వారు లేరు.

– మున్నా బేగం, గ్రామస్తురాలు

రోజూ ఎడ్లబండిలో తెస్తాం



నీళ్ల కోసం తిప్పలైతంది. ఏమి చేయాలన్నా నీళ్ల అవసరం.. అవే లేకపోతే ఎలా..? ఎడ్లకు కూడా ఊర్ల నీళ్లు దొరుకవు. వాగుకు తీసుకువచ్చి తాగిపిస్తున్నాం. మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నా సరిపోతలేవు. రోజూ ఎడ్లబండిలో డ్రమ్ము వేసుకోని వాగుకు పోయి నీళ్ల తెచ్చుకుంటున్నం. ఎండకు ఇసుకలో ఎడ్లు కూడా నడుస్తలేవు. ఒకరిద్దరు వెనుక ఉండి నెట్టుతేనే ఒడ్డు ఎక్కుతున్నయి.

– టేకల చందు, గ్రామస్తుడు

బావులు ఎండినయ్..



గ్రామంలోని చేతి పంపులు, బావులు నీళ్ల లేక ఎండినయ్.. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అవసరాల కోసం ఎడ్లబండిలో వాగు నుంచి నీళ్ల తెచ్చుకుంటున్నం. శుభకార్యం ఉంటే మరింత కష్టపడాల్సిందే. మొట్లగూడ తాగునీటి తీర్చడానికి శాశ్వత పరిష్కారం కావాలి.

– ఇర్ఫాన్, గ్రామస్తుడు

నిరుపయోగంగా 'ఇంటెక్‌వెల్'

- మూడేళ్లుగా పని చేయని సోలార్ సిస్టం



పెద్దవాగు వద్ద నిరుపయోగంగా ఇంటెక్‌వెల్

దహెగాం(సిర్పూర్): ప్రజల దాహార్తి తీర్చేందుకు పదేళ్ల క్రితం పెద్దవాగు ఒడ్డున నిర్మించిన ఇంటెక్‌వెల్ నిరుపయోగంగా మారింది. మూడేళ్లుగా పని చేయడం లేదు. దహెగాం మండలంలోని మొట్లగూడ, రాంపూర్, రావులపల్లి ప్రజల అవసరాలు తీర్చేందుకు అప్పటి ప్రభుత్వం నాబార్డు ద్వారా సుమారు రూ.2 కోట్లు మంజూరు చేసింది. మొట్లగూడ సమీపంలోని పెద్దవాగు వద్ద సోలార్ సిస్టంతో నడిచే విధంగా పదేళ్ల కిత్రం ఇంటెక్‌వెల్ నిర్మించారు. ఇంటెక్‌వెల్ నుంచి వాగులోకి పైప్‌లైన్ వేశారు. సోలార్‌తో మోటార్లు నడిచేవి. సోలార్ విద్యుత్‌తో నీళ్లను పంపింగ్ చేసి మొట్లగూడ, రాంపూర్‌కు తాగునీటిని సరఫరా చేసేవారు.

కొట్టుకుపోయిన పైప్‌లైన్

సిర్పూర్ పేపర్ మిల్లు పునఃప్రారంభం తర్వాత పెద్దవాగులో నీరు కలుషితం అవుతుందని ఇంటెక్ వెల్ ద్వారా వచ్చే నీటికి గ్రామస్తులు వినియోగించడం మానేశారు. మూడేళ్ల క్రితం పెద్ద వాగులో వరదలు వచ్చి వాగులోని పైప్‌లైన్లు కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి ఈ పథకం నిరుపయోగంగా మారింది. మొట్లగూడలో త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో మోటార్లు నడవడానికి వాగు ఒడ్డున గుట్టపై సోలార్ సిస్టం ఏర్పాటు చేశారు.

ఎర్రవాగు ఇంటెక్‌వెల్ నుంచి ఇలా..

నాబార్డు నిధులతో గెర్రె సమీపంలోని ఎర్రవాగు వద్ద రూ.4. 50 కోట్లతో నిర్మించిన ఇంటెక్‌వెల్ ద్వారా గెర్రె, ఈటపల్లి, మెత్యం, చంద్రపల్లి, కుంచవెల్లి గ్రామాలకు తాగు నీరందిస్తున్నారు. ఎర్రవాగు ఎండిపోవడంతో మిషన్ భగీరథ పథకం నుంచి వచ్చే నీటిని ఇంటెక్‌వెల్‌లో నింపి అక్కడి నుంచి సరఫరా చేస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

మొట్లగూడ సమీపంలోని పెద్దవాగు వద్ద నిర్మించిన ఇంటెక్‌వెల్ మూడేళ్లుగా నిరుపయోగంగా మారిన మాట వాస్తవమే. ఉన్నతాధికారుల ఆదేశాలతో మొట్లగూడ ఇంటెక్‌వెల్ వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. మరోసారి అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– ఇనోస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- కెస్లాగూడ, ధనోరా పంప్‌హౌస్‌ల పరిశీలన



పంప్‌హౌస్ పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కెరమెరి(ఆసిఫాబాద్): ఎద్దడి లేకుండా అన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని కెస్లాగూడ, ధనోరా మిషన్ భగీరథ పంప్‌హౌస్‌లను బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయంతో కెస్లాగూడ పంప్‌హౌస్ నుంచి గ్రామాలకు సక్రమంగా నీటిని అందించలేకపోతున్నామని అధికారులు పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ అవసరమైతే ప్రత్యేక అధికారిని నియమించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. పైప్‌లైన్ల లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయాలని సూచించారు. అనంతరం సాంగ్వి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వీవో అధ్యక్షురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో అనిల్‌కుమార్, డీపీవో భిక్షపతి, ఈఈ వెంకటపతి, డీఈ రాకేశ్, ఏఈలు విశ్వేశ్వరరావు, సంతోష్, కృష్ణతేజ్, ఎంపీడీవో కృష్ణారావు, తహసీల్దార్ దత్తుప్రసాద్, డీటీ సంతోష్‌కుమార్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అడ పీహెచ్‌సీ తనిఖీ

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అడ పీహెచ్‌సీని బుధవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తనిఖీ చేశారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని సిబ్బందికి సూచించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎంహెచ్‌వో తుకారాం ఉన్నారు.

జైళ్ల ఉన్నతీకరణకు ప్రత్యేక కమిటీ

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఆసిఫాబాద్‌అర్బన్: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో ప్రస్తుతం ఉన్న జైళ్ల ఉన్నతీకరణ, విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో కమిటీ సభ్యులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని జైళ్లను విస్తరించేందుకు అవసరమైన భూమిని గుర్తించేందుకు కమిటీని ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్ జైలు ఉన్నతీకరణలో భాగంగా ఖైదీలకు వైద్య సేవలు, ములాఖత్, వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించడంపై చర్చించామని పేర్కొన్నారు. ఈ కమిటీలో చైర్మన్‌గా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, సభ్యులుగా డిస్ట్రిక్ మేజిస్ట్రేట్, సీనియర్ సూపరింటెండెంట్/ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, కన్వీనర్‌గా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వ్యవహరిస్తారని తెలిపారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి, డీఆర్‌వో లోకేశ్వర్‌రావు, అదనపు ప్రత్యేక ఉపకారాగారం సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని నిరుద్యోగులకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్స్, ఎస్‌సీఈఆర్, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్ తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం మూడు నెలల స్పెషల్ ఫౌండేషన్ కోర్సు ద్వారా ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్ తెలిపారు. ఈ నెల 16న కాగజ్‌నగర్ పట్టణంలోని సాయితేజా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తామని పేర్కొన్నారు. డిగ్రీ మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. అభ్యర్థులు కుల, ఆదాయ, విద్యార్హత, ఆధార్ కార్డు జిరాక్సులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని సూచించారు. అర్హత గల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99852 74060, 82472 99217 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

ఆసిఫాబాద్: వరి ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కొనుగోలు కేంద్రాల వద్ద నీడ, తాగునీరు, ఇతర వసతులు కల్పించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోగా ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో మరమ్మతులు పూర్తి చేసేవిధంగా అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. వేసవి పూర్తయ్యే వరకు ప్రతీ ఇంటికి తాగునీరందించేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వరిధాన్యం కొనుగోళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. డీఈవో అశోక్, డీఆర్‌డీవో సురేందర్, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ నర్సింహారావు, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ పట్టణంలోని కదీం ఈద్గా వద్ద రంజాన్ ఏర్పాట్లు

నేడు రంజాన్

- ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు, ఈద్గాల్లో ఏర్పాట్లు
- ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌కు సిద్ధమైన ముస్లింలు

నెన్నెల: రంజాన్ ఉపవాస దీక్షలు ముగిసాయి. ముస్లింలు అత్యంత పవిత్రంగా నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించి బుధవారం నాటికి 30 రోజులు కావడంతోపాటు సాయంత్రం ఆకాశంలో నెలవంక దర్శనమిచ్చింది. దీంతో గురువారం రంజాన్ పండుగను జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. రంజాన్ దీక్షల అనంతరం షవ్వాల్ మాసం మొదటి రోజు నిర్వహించుకునే పండుగే ఈద్-ఉల్-ఫితర్. ఈ రోజు మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేశారు.

ఫిత్రాదానం

పండుగ రోజు నమాజ్‌కు ముందు పేదలకు ఇచ్చే దానమే ఫిత్రా. ఉపవాసాల పాటింపులో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పొరపాట్లు, లోపాలు జరుగుతూనే ఉంటాయి. ఈ లోపాలను పరిహారం చేసేదే ఫిత్రాదానం. సమాజంలోని నిరుపేదలు మంచి వస్త్రాలు ధరించి, మంచి వంటకాలు ఆరగించే వీలు కల్పిస్తూ ముస్లింలు దానం చేస్తుంటారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- జిల్లా కేంద్రంలో ఓటరు అవగాహన సదస్సు

ఆసిఫాబాద్: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని రోజ్‌గార్డెన్‌లో బుధవారం పోలీస్, పరిపాలన శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన సదస్సుకు ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటుహక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఓటు వేసి, సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. మే 13న జరిగే పోలింగ్ కోసం జిల్లాలో 676 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఈ నెల 15లోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని 85 సంవత్సరాలు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే టోల్‌ఫ్రీ నం.1950, సీవిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. వందశాతం ఓటింగ్ నమోదయ్యేందుకు అందరు బాధ్యత తీసుకోవాలన్నారు. డీఆర్‌డీవో సురేందర్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఎస్పీ సదయ్య, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన విద్యార్థులు

యాప్ ద్వారా పర్యవేక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్: పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న వసతులను యాప్ ద్వారా పర్యవేక్షిస్తామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక యాప్‌ను పరిశీలించారు. డీఎస్పీ సదయ్య, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కోళ్లను మింగిన కొండచిలువ హతం



మృతిచెందిన కొండచిలువ, కోడి

నెన్నెల: మండల కేంద్రంలోని చర్చి సమీపంలో ఉన్న దుర్గం మల్లేష్ ఇంటి ఆవరణలోకి బుధవారం ఓ కొండచిలువ ప్రవేశించింది. రెండు కోడిపిల్లలను మింగింది. మరో కోడిని చుట్టేసి చంపే ప్రయత్నం చేసింది. కోళ్లు బిగ్గరగా అరిచి చెల్లాచెదురు కావడంతో ఇంట్లో నుంచి మల్లేష్ బయటకు వెళ్లి చూశాడు. కొండచిలువ కోడిని పట్టుకుని ఉండడం గమనించాడు. వెంటనే పెద్ద కర్ర తీసుకొని కొండచిలువను హతమార్చాడు. అప్పటికే కోడి మృతిచెందింది. కొండచిలువ ఆరు ఫీట్ల పొడవు, సుమారు 8 కిలోల బరువు ఉంది. ఇప్పటికే 8 కోడిపిల్లలు, నాలుగు కోళ్లు మృతిచెందాయని మల్లేష్ తెలిపాడు.

ఆసుపత్రి పైకెక్కి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నం చేసిన రాజు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పైకెక్కి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మంచిర్యాల పట్టణంలోని ఆండాళమ్మ కాలనీకి చెందిన రాజు కుటుంబ కలహాలతో బుధవారం హెయిర్డై ప్యాకెట్లు తాగడంతో ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. తాను చికిత్స చేయించుకోనని, చనిపోతానంటూ ఆసుపత్రి భవనం పైకెక్కి కొంత సమయం వరకు అక్కడే ఉన్నాడు. ఆసుపత్రి ఔట్పోస్టు పోలీసులు వచ్చి రాజును కిందకు దించి ఆసుపత్రిలో చేర్చారు.

కాళ్ల నొప్పులు భరించలేక ఆత్మహత్య

తానూరు(ముధోల్): కాళ్లనొప్పులు భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన అవదుత్వార్ లచ్చిరాం (59) కొంతకాలంగా బోదకాల వ్యాధితో బాధపడుతున్నాడు. గతంలో కాళ్ల నొప్పులు అధికం కావడంతో సర్జరీ చేయించుకున్నాడు. అయినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం మధ్యాహ్నం పంటచేనుకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. ధర్మాబాద్ రోడ్డులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ప్రయాణికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్సై సందీప్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య గంగాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మల్కెపల్లిలో ఇల్లు దగ్ధం

కాసిపేట: మండలంలోని మల్కెపల్లిలో మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్సర్క్యూట్ జరిగి కుడిమెత రాంచందర్ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో సామగ్రి ఉండగా.. ఇంటి వెనుకాల ఉన్న మరో ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రించడంతో ప్రమాదం తప్పింది. పట్టాపాస్‌పుస్తకం, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు, ఎస్ఎస్‌సీ మెమో, రేషన్‌కార్డు, ఓటరుకార్డు, టీవీ, ఫ్రిజ్, మొబైల్‌ఫోన్ ఇతర వస్తువులు కాలిపోయాయి. ఎంఆర్ఐ సులోచన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నష్టపోయిన ఆస్తి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితులు తెలిపారు. లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న రాంచందర్ కుటుంబానికి తక్షణ సాయంగా రెవెన్యూ శాఖ 50 కిలోల బియ్యం, పప్పు, నూనె, ఇతర సామగ్రి అందించారు.

మత్తు అలజడి

- జోరుగా గంజాయి విక్రయాలు
- పెరిగిపోతున్న ఆగడాలు



సింగరేణి కళావేదిక పక్కన పాడుబడిన రూమ్‌లో గంజాయి దమ్ముకొడుతున్న ఓ యువకుడు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాల్టీ, చుట్టుపక్కల గ్రామాల్లో గంజాయి గుప్పుమంటోంది. నిర్మానుష్య ప్రాంతాలు, పాడుబడిన ఇళ్లు, శివారు ప్రాంతాలను ఎంచుకుని యువత గంజాయి దమ్ము కొడుతోంది. కొందరు మహారాష్ట్ర నుంచి గంజాయిని గుట్టుగా రవాణా చేసి అధిక ధరకు అమ్మకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. యువకులు, విద్యార్థులకు విక్రయిస్తూ బానిసగా మారుస్తున్నారు. గంజాయి నివారణకు పోలీసులు ఇటీవల కాలంలో కట్టడి చర్యలు తీవ్రతరం చేసి కొందరిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. అయినా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. బానిసగా మారిన యువకులు దమ్ముకొట్టే వ్యసనాన్ని మానుకోలేకపోతున్నారు.

మున్సిపాలిటీ పరిధిలో..

బెల్లంపల్లి మున్సిపాల్టీ పరిధిలోని పలు ప్రాంతాలు గంజాయికి అడ్డాగా మారాయి. రేయింబవళ్లు వ్యసనపరులు దమ్ము కొడుతూ మత్తులో జోగుతున్నారు. సోయి లేకుండా వ్యవహరించడం, కయ్యానికి కాలుదువ్వడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. కన్నాలబస్తీ శివారు వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధి, రైల్వేట్రాక్, రైల్వే పై ఓవర్ బ్రిడ్జి కింద, కొత్తబస్టాండ్ ఏరియా, ప్రభుత్వ పాలిటెక్నిక్ పరిసరాలు, పోశమ్మ చెరువు కట్ట, రవీందర్‌నగర్, సింగరేణి కళావేదిక పక్కన ఉన్న పాడుబడిన క్వార్టర్లు, అంబేద్కర్ భవన్ పరిసరాలు, టీసీఓఏ క్లబ్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, రాంగనర్, హన్మాన్‌బస్తీ, నెంబర్ 2 ఇంక్‌లైన్, రైల్వేస్టేషన్ ఏరియా, బజారు ఏరియా, బెల్లంపల్లి బస్తీ, షంషీర్‌నగర్, కాంటా చౌరస్తా ఎల్లమ్మగుడి, మామిడి తోటలు గంజాయి స్థావరాలుగా మారాయి. కొందరు యువకులు బాహాటంగానే గంజాయి దమ్ము కొడుతూ రోడ్లపై తచ్చాడడం, రాకపోకలు చేస్తున్న వారిని బెదిరించడం, దౌర్జన్యాలకు దిగడం చేస్తున్నారు. కొందరు విద్యార్థులు సైతం గంజాయికి ఆకర్షితులైనట్లుగా ప్రచారం జరుగుతోంది.

గ్రామాల్లో..

గంజాయి మత్తు గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించింది. బెల్లంపల్లి మండలం మాలగురిజాల, తాళ్ల గురిజాల, రంగపేట, బట్వాన్‌పల్లి, చంద్రవెల్లి, బుధాకుర్దు, బుధాకలాన్, దుగినేపల్లి తదితర గ్రామాలకు విస్తరించినట్లుగా తెలుస్తోంది. భీమిని, కన్నెపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నెల మండలాల్లోని పలు గ్రామాల్లో కొందరు గంజాయికి అలవాటు పడ్డట్లుగా ప్రచారంలో ఉంది.

ఆగడాలకు వెనుకాడని వైనం

గంజాయి మత్తులో యువకుల ఆగడాలు శృతి మీరుతున్నాయి. ఇంట్లో, బయట గొడవలు చోటు చేసుకుంటున్నాయి. డబ్బు ల కోసం తల్లిదండ్రులను వేధించడం, చేయి చేసుకుంటున్న సందర్భాలు ఉన్నా ఆ విషయాన్ని బయట చెప్పుకోలేక తల్లిదండ్రులు కుములుతున్నారు. శుభకార్యాల్లో కవ్వింపు చర్యలకు పాల్పడడం, గ్రూపులు కట్టి ఘర్షణకు దిగడం, భౌతికదాడులు చేసుకోవడం సర్వసాధారణంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు గంజాయి అక్రమ రవాణా, క్రయ విక్రయాలు అరికట్టాలని, యువకుల మత్తు వదిలేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మచ్చుకు కొన్ని ఘటనలు

- బెల్లంపల్లిలో పదిహేను రోజుల క్రితం రెండు వర్గాలుగా విడిపోయిన యువకులు గంజాయి మత్తులో ఘర్షణ పడి కొట్టుకున్నారు.
- బజారు ఏరియా ప్రాంతంలో ఇద్దరు యువకులు 20రోజుల క్రితం గంజాయి తాగి రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న పాదచారుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారు.
- రోజువారీగా చీకటి పడగానే బజారు ఏరియా ప్రాంతంలో గంజాయి దమ్ము కొట్టి బైక్‌పై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ తోటి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.
- బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామంలో ఓ యువకుడు గంజాయికి బానిసగా మారి తల్లిని చావబాది చివరికి తానే ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు.

నిరంతరం నిఘా

గంజాయి క్రయ విక్రయాలు సాగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. పట్టుబడితే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. హాట్‌స్పాట్‌లు, నిర్మానుష్య, అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాం. గంజాయికి అలవాటు పడిన, అమ్మకాలు సాగిస్తున్న యువకులను బైండోవర్ చేస్తున్నాం. గంజాయితో పట్టుబడిన యువకులను అరెస్టు చేసి జైలుకు పంపిస్తున్నాం.

– అఫ్జలుద్దీన్, సీఐ బెల్లంపల్లి రూరల్

పేద ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ



సరుకుల కిట్ అందిస్తున్న రాజ్‌మహ్మద్

బెల్లంపల్లి: రంజాన్‌ను పురస్కరించుకుని బుధవారం బెల్లంపల్లిలోని వాణినికేతన్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి రేగుల అనిల్‌కుమార్ నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నాడు. చదువు పూర్తి చేసి స్వీడన్‌లో స్థిరపడిన అతడు రూ.25 వేలు పంపించి బెల్లంపల్లిలోని తన మిత్రుల ద్వారా నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయించాడు. బజారు ఏరియా, లక్ష్మీపూర్, శాంతిఖని, సుభాష్‌నగర్, కాంట్రాక్టర్ బస్తీ, రాంనగర్ తదితర ప్రాంతాల్లోని పేద ముస్లిం కుటుంబాలను గుర్తించి ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.కే.రాజ్‌మహ్మద్ ఆధ్వర్యంలో రంజాన్ కిట్లను పంపిణీ చేయించాడు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఏఎస్సై తిరుపతి, ఉపాధ్యాయుడు చక్రపాణి, రమేష్, వెంకటస్వామి, తాజ్‌బాబా సేవా సమితి అధ్యక్షుడు ఉస్మాన్ బాష పాల్గొన్నారు.

ఎస్సైగా మందమర్రి వాసి ఎంపిక



అన్వేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాకు చెందిన అజ్మీర అన్వేష్ సీఐఎస్ఎఫ్ విభాగంలో ఎస్సైగా ఎంపికయ్యాడు. ఇటీవల విడుదలైన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 1475 ర్యాంకు సాధించి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా అర్హత సాధించాడు. పద్మ, శంకర్ దంపతుల కుమారుడైన అన్వేష్ స్థానిక మోడల్ స్కూల్‌లో ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు అభ్యసించాడు. తండ్రి శంకర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూ చదివించాడు. 2020–23వరకు బీటెక్ చదివిన వెంటనే నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోగా అన్ని పరీక్షల్లో మొదటి ప్రయత్నంలోనే ఎంపికయ్యాడు. బుధవారం మందమర్రికి వచ్చిన అన్వేష్‌ను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి, సిబ్బంది అభినందించారు. మొదటి ప్రయత్నంలోనే ఎస్సైగా ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉందని అన్వేష్ తెలిపాడు.

'గిరి' ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ గెజిటెడ్ హెచ్ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రికి వినతిపత్రం అందించారు. శ్రీరాములు మాట్లాడుతూ గిరిజన శాఖలో ఖాళీగా ఉన్న మండల విద్యాధికారులు, ఇతర పోస్టులు భర్తీ చేయాలన్నారు. గిరిజన ఉపాధ్యాయులకు వసతిగృహాల బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో వారికి గురుకులాల్లో అమలు చేస్తున్న వేతన స్కేల్ అమలు చేయాలని కోరారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, కాంట్రాక్టు టీచర్లను రెగ్యులర్ చేయాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సారయ్య, సుధాకర్, ఉద్దవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఏఐటీయూసీ పోరాటంతోనే ఉచిత బస్సు'



బస్సు ప్రారంభిస్తున్న తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏఐటీయూసీ పోరాటంతోనే ఏరియా కార్మికులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారని ఆ యూనియన్ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. సింగరేణి యాజమాన్యం గోలేటి ఎక్స్‌రోడ్ నుంచి కై రిగూడ ఓసీపీ వరకు మూడు షిఫ్టుల్లో ఏర్పాటు చేసిన ఉచిత బస్సును బుధవారం ఏఐటీయూసీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ మూడు షిఫ్టుల్లో బస్సు సౌకర్యం లేకపోవడంతో కై రిగూడలో విధులు నిర్వర్తించే కార్మికులు పడే ఇబ్బందులను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు జీఎం రవి ప్రసాద్ చొరవతో బస్సు ప్రారంభమైందన్నారు. ఉచిత బస్సును కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీఎం రవిప్రసాద్, కైరిగూడ పీవో సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, రాజేశ్, కిరణ్‌బాబు, శేష శయన రావు, సహాయ కార్యదర్శి ఓదెలు, మైన్స్, సేఫ్టీ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, కోటి, నరేశ్, రాజు, రవి, గణేష్, రారాజు, సుధాకర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లోని స్థలంపై వివాదం

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం తిమ్మాపూర్ శివారులోని సర్వే నంబరు 333, 334లో గల ఓ స్థలంపై ఇరువర్గాల మధ్య బుధవారం వివాదం ఏర్పడింది. ఏళ్లుగా తమ పరిధిలో ఉన్న భూమికి సంబంధించి తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని భూ యజమానులుగా చెప్పుకుంటున్న మరియమ్మ, హనుమయ్య, రాజం, లక్ష్మి తదితరులు పేర్కొన్నారు. ఇరువర్గాల మధ్య కొద్దిసేపు ఘర్షణ వాతావరణం ఏర్పడగా రెవెన్యూ అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామన్నారు.

నామినేటెడ్ కాదు.. చట్టసభల్లో పదవులు కావాలి

- ఆదివాసీ ఆరు తెగల నేతల డిమాండ్



అభివాదం చేస్తున్న ఆదివాసీ ఆరు తెగల నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: రాజకీయ పార్టీలు ఆదివాసీల్లోని ఒకే తెగకు గుర్తింపునిస్తూ, తమను పట్టించుకోవడం లేదని పర్ధాన్, తోటి, కొలాం, నాయక్‌పొడ్, అంద్, మన్నెవార్ తెగలకు చెందిన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నామినేటెడ్ పదవులు కాదని తమకు చట్ట సభల్లో గొంతెత్తే పదవులు కావాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ఆరు తెగల ఐక్యవేదిక సమావేశం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో బుధవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఆయా సంఘాల రాష్ట్ర నేతలు హాజరై మాట్లాడారు. ఆయా రాజకీయ పార్టీలు గుర్తింపు నివ్వకపోవడంతో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్నామన్నారు. తాము ఏ తెగకు వ్యతిరేకం కాదని, ఆయా పార్టీలు అన్ని తెగలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. అవసరమైతే ఆరు తెగల్లోని ఒకరిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిపేందుకు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు ఆత్రం భీంరావ్, జడ్కే పాండురంగ్, సట్ల అశోక్, మెస్రం బాపురావ్, ఖమ్ము, నగేశ్, ఆనంద్‌రావ్, భీముడు, సుధాకర్, శంకర్, ప్రేంకుమార్, సానేరావ్, రాజు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఔదార్యం



ఆసుపత్రిలో చేర్పించిన కానిస్టేబుల్

జన్నారం: విష కీటకం కుట్టడంతో అర్ధరాత్రి అవస్థలు పడుతున్న ఓ వ్యక్తిని ఆసుపత్రిలో చేర్పించి పోలీసులు ఔదార్యం చాటుకున్నారు. మండలంలోని తంగళ్లపెల్లి గ్రామానికి డొంగరి కృష్ణకు మంగళవారం అర్ధరాత్రి విషపురుగు కుట్టింది. భయంతో జన్నారానికి వచ్చి ఆసుపత్రి సిబ్బందిని లేపే ప్రయత్నం చేశాడు. కంగారుగా రోడ్డుపై తిరుగుతుండడాన్ని పెట్రోలింగ్ బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డు నీలయ్య గమనించారు. ఆరా తీయగా తనకు విషపురుగు కుట్టిందని, చెమటలు పట్టి తల తిరుగుతున్నట్లు తెలిపాడు. వెంటనే అతడిని ద్విచక్ర వాహనంపై ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. ప్రమాదం తప్పిందని వైద్యుడు చెప్పడంతో వేకువ జామున 4గంటల ప్రాంతంలో అక్కడి నుంచి వెళ్లినట్లు కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

రక్తహీనతతో గర్భిణి మృతి



దూర్ విమలాబాయి(ఫైల్)

సిరికొండ: రక్తహీనతతో గర్భిణి మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న ఎక్స్‌రోడ్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పెందూర్ సాయికిరణ్‌కు గత ఏడాది మేలో ఇచ్చోడ మండలం బాదిగూడకు చెందిన విమలాబాయితో(25) వివాహం అయింది. ఆమె ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి. ప్రసవం కోసం ఇటీవల పుట్టింటికి వెళ్లింది. మంగళవారం మధ్యాహ్నం విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు 108లో ఇచ్చోడ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్‌నర్సు ఆమెకు సాధారణ నొప్పులే అని వైద్యం అందించారు. అయితే సాయంత్రం గర్భిణికి కడుపు గట్టిపడిన విషయం కుటుంబ సభ్యులు సిబ్బందికి తెలుపడంతో వెంటనే రిమ్స్‌కు తరలించారు. 108లో రిమ్స్‌కు తరలించేలోగా మృతి చెందినట్లు తెలిపారు. అయితే ఇచ్చోడ పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండి, సకాలంలో వైద్యం అంది ఉంటే విమలాబాయి బతికి ఉండేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యుడు సాగర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. 'వారం నుంచి నేను సెలవులో ఉన్నా.. అక్కడ ఏం జరిగిందో.. మంగళవారం ఎవరిని ఇన్‌చార్జిగా నియమించారో నాకు తెలియదు..' అంటూ పేర్కొనడం గమనార్హం. కాగా, తీవ్ర రక్తహీనత, విరేచనాలతో గర్భిణి మృతి చెందినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో మనోహర్ పేర్కొన్నారు.

మహా సంకల్ప పాదయాత్ర ప్రారంభం



దీక్ష భూమి వద్ద సేవాలాల్ మహరాజ్ పల్లకితో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం కొత్తపల్లి హెచ్ గ్రామంలోని బంజారా జాతీయ దీక్ష భూమి నుంచి మహారాష్ట్రలోని బంజారా కాశి పొరాదేవి పుణ్యక్షేత్రం వరకు వేలమంది సేవాలాల్ భక్తులు చేపట్టిన మహా సంకల్ప పాదయాత్రను బుధవారం దీక్ష గురువు సద్గురు ప్రేమ్‌సింగ్ మహరాజ్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుంది అన్నారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సేవాలాల్ భక్తులు దాదాపు 150 కిలోమీటర్లు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో పాదయాత్ర కొనసాగించాలని తెలిపారు. సేవాలాల్ భక్తులతో కలిసి జెడ్పీ చైర్మన్ ఉట్నూరు మండలం హస్నాపూర్ గ్రామం వరకు పాదయాత్రలో పాల్గొన్నారు. మండలంలోని గంగాపూర్, తాడేహత్నూర్ గ్రామాల్లో పాదయాత్రకు ప్రజలు నీరాజనం పలికారు. పాదయాత్రలో ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, మాజీ ఎమ్మెల్యే రేఖశ్యాంనాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరేష్ జాదవ్, ఐటీడీఏ ప్రకాష్, బానోత్ గజానంద్‌నాయక్, తదితరులు ఉన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాష్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తితోపాటు కొనుగోలు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏసీపీ ప్రకాష్ తెలిపారు. స్థానిక ఏసీపీ కార్యాలయంలో బుధవారం వివరాలు వెల్లడించారు. స్థానిక రాళ్లపేటకు చెందిన ఆల్‌మిల్కర్ శ్యామ్ మహారాష్ట్రలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి జిల్లా కేంద్రంలోని యువతకు విక్రయించడానికి తీసుకువచ్చాడు. హమాలీవాడకు చెందిన కారెంగుల అరుణ్‌కు బైపాస్‌రోడ్‌లో విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద లభించిన 500గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, ఆల్‌మిల్కర్ శ్యామ్‌పై గతంలో పీడీ యాక్టు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఐ బన్సీలాల్, ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ విగ్రహానికి అవమానం



గోనె సంచులతో చుట్టేసిన మల్లేష్ విగ్రహం

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన సీపీఐ శాసనసభ పక్ష మాజీ నేత, దివంగత గుండా మల్లేష్ విగ్రహానికి అవమానం జరిగింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు తొడిగారు. బజారు ఏరియాలోని మల్లేష్ విగ్రహాన్ని గోనెసంచులతో చుట్టేశారు. ఆలస్యంగా గ్రహించిన సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమొగిలి, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి జీసీ మాణిక్యం, సీపీఐ సీనియర్ నాయకుడు రత్నం రాజం ఆ విషయాన్ని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గోనే సంచులు చుట్టి అవమానిస్తారా అని నిలదీశారు. బుధవారం రాత్రి ఎన్నికల అధికారుల ఆదేశాలతో సిబ్బంది గోనే సంచులను తీసేసి వస్త్రంతో మల్లేష్ విగ్రహాన్ని చుట్టేశారు. ఎన్నికల అధికారులు వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి.

ఎడారిలా.. ఎర్రవాగు



వరద లేకపోవడంతో దహెగాం మండలం గెర్రె సమీపంలోని ఎర్రవాగు ఎడారిని తలపిస్తోంది. మార్చి నుంచి తగ్గుతూ ప్రస్తుతం పూర్తిగా ఎండిపోయింది. సమీప గ్రామాల్లోని మూగజీవాలు దాహార్తి తీర్చుకునేందుకు అల్లాడుతున్నాయి. మళ్లీ వర్షాలు కురిసే వరకు వరద వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గడిచిన కొన్నేళ్లలో ఏప్రిల్‌లోనే పూర్తిగా వాగు ఎండిపోవడం ఇదే తొలిసారని స్థానికులు పేర్కొంటున్నారు. – దహెగాం

పిడుగుపాటుతో ఎద్దు మృతి

బజార్‌హత్నూర్: మండలంలోని మంజరంతండా గ్రామంలో మంగళవారం రాత్రి పిడుగుపాటుతో ఎద్దు మృతి చెందింది. నిస్తే నెహ్రూలాల్‌కు చెందిన ఎడ్లను పొలం పనుల తర్వాత రాత్రి కొట్టంలో కట్టి ఉంచాడు. అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. బుధవారం ఉదయం కొట్టం వద్దకు వెళ్లి చూడగా పిడుగు పాటుతో ఎద్దు మృతి చెంది కనిపించినట్లు బాధిత రైతు తెలిపాడు. ఎద్దు విలువ రూ.60 వేల వరకు ఉంటుందని పేర్కొన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.